ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 6
సంపుటి : 3
సంచిక : 166

సోమవారం 16 డిసెంబర్ 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



## భారీ స్కోర్ దిశగా ఆస్ట్రేలియా

హెడ్, స్మిత్ సెంచరీలు..

ఆసీస్ స్కోరు 405/7

బుమ్రాకి ఐదు వికెట్లు

.. వివరాలు 7లో

# నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు

## భూమిలేని పేదలకు శుభవార్త



- ఈ నెల 28 నుంచి అమలులోకి మరో పథకం
- తొలి ఇన్‌స్టాల్‌మెంట్ రూ.6 వేలు పేదల ఖాతాలో జమ
- అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్‌రింగ్‌రోడ్డు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రంలో భూమిలేని నిరుపేదల కూలీలకు సర్కారు శుభవార్త చెప్పింది. ఏడాదికి రూ.12 వేలు జమ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మొత్తాన్ని రెండు ఇన్‌స్టాల్స్‌మెంట్స్‌లో ఇస్తామని చెప్పారు. తొలి ఇన్‌స్టాల్‌మెంట్ రూ. 6 వేలను కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన రోజైన డిసెంబర్ 28 రోజున జమ చేస్తామని తెలిపారు. రైతుల ఖాతాల్లో సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని చెప్పారు.

**ఖమ్మం, రోమింగ్ న్యూస్:**

భూమిలేని నిరుపేద కుటుంబాలకు తొలి ఇన్‌స్టాల్‌మెంట్ రూ. 6 వేలను కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన రోజైన డిసెంబర్ 28 రోజున జమ చేస్తామని తెలిపారు. రైతుల ఖాతాల్లో సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పంటలు పండించేందుకు రైతులకు ఇచ్చే ప్రోత్సహాన్ని (రైతు భరోసా) అందజేసేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో ప్రత్యక్షంగా పరోక్షంగా 7,11,911 కోట్ల రూపాయలు అప్పులు చేసి ప్రజలపై భారం వేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

మిగతా 2 లో



# అమెరికాకు కేసీఆర్

- త్వరలోనే వెళ్లనున్న గులాబీ బాస్
- టూర్‌షెడ్యూల్ ఖరారు కాలేదన్న నేతలు
- లైఫ్‌లో ఫస్ట్ టైం వెళ్లనున్న బీఆర్ఎస్ అధినేత

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్.. అమెరికాకు వెళ్లనున్నారు. అది కూడా తన జీవితంగా మొట్టమొదటిసారి. రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్.. చేపట్టిన విదేశీ పర్యటనలు కేవలం రెండే రెండు కావటం గమనార్హం. అందులో ఒకటి సింగాపూర్, రెండోది చైనా. అంతకు మించి కేసీఆర్.. తన జీవితకాలంలో దేశం దాటలేదు. కాగా.. ఇప్పుడు లైఫ్‌లో ఫస్ట్ టైం.. అమెరికాకు వెళ్లనున్నట్టు సమాచారం అందుతోంది.

మిగతా 2 లో



# తొలి ప్రధానికి సీఎం నివాళి

- సర్దార్‌వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి
- మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ హాజరు

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** భారత దేశ తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని, జూబ్లీహిల్స్ తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నివాళులు అర్పించిన వారిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.


మిగతా 2 లో



## అల్విదా ఉస్తాద్

- తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ కన్నుమూత
- అమెరికాలో చికిత్స పొందుతూ మృతి

03



## ఐ యామ్‌సారి!

- జర్నలిస్టుకు మోహన్ బాబు క్షమాపణలు
- ఆసుపత్రికి వెళ్లి మాట్లాడిన నటుడు
- ఆయన వెంట విష్ణు కూడా..

02



## పెండ్లి చేసుకున్న పది రోజులకే..

- భార్యను అడవిలో వదిలివెళ్లిన భర్త
- ఇన్‌స్టాగ్రాం పరిచయంతో 8 నెలలుగా సహజీవనం
- సిద్దిపేట జిల్లా వంటిమామిడిలో ఘటన

# గద్దర్‌ఎంతో మందికి స్ఫూర్తిదాయం

## ఆయన పాట వింటే..

- పాట ఉన్నంతకాలం ఆయన సజీవం
- ఉద్యమంలో ఆయన పాత్ర అనన్యం
- సిద్దిపేటలో గద్దర్‌విగ్రహం పెట్టిస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు
- గద్దర్‌ఫౌండేషన్‌పీపుల్స్‌కాన్ఫరెన్స్




**సిద్దిపేట, రోమింగ్ న్యూస్:** మలిదశ ఉద్యమంలో ద్యమం లో ప్రజా యుద్ధ నౌక గద్దర్ 'పొడుస్తున్న పొద్దు మీద' పాటతో రోమాలు నిక్క పొడిచేవని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నా రు. ఆదివారం సిద్దిపేట విపంచి కళా నిలయంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గద్దర్ సాహిత్య రచ నల కార్యక్రమం నిర్వహించారు.

మిగతా 2 లో

# అరాచక పాలన మరువం

- ప్రభుత్వంపై అసత్య ప్రచారం తగదు
- మీరు చేసిన దౌర్భాగ్యపు పనులను చక్కదిద్దుతున్నాం
- అసెంబ్లీకి వచ్చి అభివృద్ధిపై సలహాలు ఇవ్వండి
- కేసీఆర్‌పై మహేశ్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వెనుకబాటుకు గురైందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు కేసీఆర్‌కు మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిరంతరం బురద జల్లుతూ ప్రజలను తప్పుదారి పట్టించడం మానుకోవాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆరు పేజీల బహిరంగ లేఖ రాశారు.

మిగతా 2 లో



## ఆ ఎన్‌కౌంటర్ బూటకం

- మృతుల్లో ఏడుగురు గ్రామీణులు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- మావోయిస్టుల లేఖ కలకలం

.. వివరాలు 2లో

## నీ సంగతి చెబుతా..

- జగిత్యాల ఎమ్మెల్యేకు కవిత మాస్ వార్నింగ్
- ఏ మొహం పెట్టుకుని కాంగ్రెస్‌లోకి వెళ్లినవని ప్రశ్న
- ఉద్యమ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ
- కేసులకు భయపడేది లేదని స్పష్టీకరణ

03




## అన్ని రంగాల్లో తిరోగమనం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



.. వివరాలు 3లో

## కొత్తగూడెం జిల్లాలో పెద్ద పులి సంచారం



03

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
16 డిసెంబర్
2024






# తొలి ప్రధానికి సీఎం నివాళి

(మొదటిపేజీ తరువాయి)

కాగా, జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో వెంకయ్య చౌదరి మర్యాదపూర్వంగా కలిశారు. ఆయనను సీఎం శాలువాతో సత్కరించారు.

**గ్రూప్-2 అభ్యర్థులకు సీఎం 'ఆల్ ది బెస్ట్'**

రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు గ్రూప్-2 పరీక్షలు రాస్తున్న ఉద్యోగార్థులకు సీఎం రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీ పరీక్షల్లో మీరు విజయం సాధించి.. తెలంగాణ ప్రభుత్వంలో చేరి రాష్ట్ర పునర్ నిర్మాణంలో భాగస్వాములుకావాలని సీఎం రేవంత్ ఆకాంక్షించారు. అటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ సహా మంత్రులంతా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అమెరికాకు కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

సాధారణంగా అయితే.. రాజకీయ నాయకులు తరచూ విదేశాల్లో పర్యటిస్తుంటారు. అందులోనూ అధికారంలో ఉంటే.. ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ సదస్సు, ఆ సదస్సు అనో.. లేక అక్కడి అభివృద్ధిని అధ్యాయనం చేసేందుకనో ఇలా రకరకాల కార్యక్రమాలు, కారణాలతో విమానాలెక్కి విదేశాల్లో వాలిపోయి విహరిస్తుంటారు. కానీ.. కేసీఆర్ మాత్రం అందుకు పూర్తి భిన్నం. సుదీర్ఘ కాలం ఉద్యమకారుడిగా ఉండటమే కాకుండా.. సుమారు 35 ఏళ్లకుపైగా సుదీర్ఘంగా రాజకీయాల్లో కొనసాగుతున్న కేసీఆర్.. కేవలం రెండే రెండు ఫారిన్ టూర్‌లతో.. దేశంలోనే అత్యంత తక్కువ విదేశీ పర్యటనలు చేసిన ముఖ్యమంత్రిగా, పొలిటికల్ లీడర్‌గా కేసీఆర్ నిలిచారు. కేసీఆర్ కుమారుడైన కేటీఆర్, కుమార్తె కవిత.. ఉన్నత విద్యను అమెరికాలోనే అభ్యసించిన విషయం తెలిసిందే. ఉన్నత విద్య తర్వాత కేటీఆర్ అక్కడే కొన్నాళ్లు ఉద్యోగం కూడా చేశారు. అయినా సరే.. కేసీఆర్ మాత్రం ఒక్కసారి కూడా అమెరికాలో అడుగు పెట్టలేదు. అయితే.. ఇప్పుడు అమెరికా వెళ్లేందుకు గులాబీ బాస్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఒకటి రెండు నెలల్లో కేసీఆర్ అమెరికా ప్రయాణం ఉంటుందని తెలుస్తోంది. అమెరికా వెళ్లనున్న కేసీఆర్.. సుమారు 2 నెలల పాటు అక్కడే ఉండే అవకాశం ఉందని సమాచారం. అయితే.. కేటీఆర్ కుమారుడు హిమాన్షు అమెరికాలోనే ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విషయం తెలిసిందే. కాగా.. కేసీఆర్‌కు తన మనవడు హిమన్షుకు మధ్య ప్రత్యేక అనుబంధం ఉంటుంది. తన మనవడు అంటే.. కేసీఆర్‌కు చాలా ప్రేమ అన్న విషయాన్ని పలు సందర్భాల్లో తెలియజేశారు కూడా. అంతగా ప్రేమించే తన మనవడు హిమాన్షు కోరిక మేరకే తాత కేసీఆర్ అమెరికా వెళ్తున్నట్లు సమాచారం. కొన్ని రోజులు అమెరికా వచ్చి రెస్ట్ తీసుకోవాలని.. ఇటీవల ఇండియా వచ్చిన హిమాన్షు తాతను కోరినట్లు తెలుస్తోంది. అయితే.. కేసీఆర్ అమెరికా వెళ్తే ఎక్కడ ఉండాలి, ఏ ప్రాంతాలు పర్యటించాలి అన్న విషయాలపై ఇప్పటి నుంచే.. అక్కడున్న ఎన్నారైలతో చర్చిస్తున్నట్టు సమాచారం. అటు తాను మనవడితో కొంత కాలం ఉన్నట్టు ఉండటమే కాకుండా.. అక్కడున్న ఎన్నారైలతో కూడా పార్టీ వ్యవహారాలు, సమావేశాలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. మొత్తానికి గులాబీ బాస్ కేసీఆర్.. త్వరలోనే అగ్రరాజ్యం అమెరికాలో అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నారన్న మాట.



# పెండ్లి చేసుకున్న పది రోజులకే..

- భార్యను అడవిలో వదిలివెళ్లిన భర్త
- ఇన్‌స్టాగ్రాం పరిచయంతో 8 నెలలుగా సహజీవనం
- సిద్దిపేట జిల్లా వంటిమామిడిలో ఘటన

**గజ్వేల్:** బెంగళూరుకు చెందిన యువతితో ఇన్‌స్టాగ్రాంలో పరిచయమే 8 నెలలు గా సహజీవనం చేసి, పెళ్లి చేసుకున్న పది రోజుల్లోనే వివాహితను యువకుడు అడవిలో వదిలి వెళ్లిన ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడిలో శనివారం సాయంత్రం జరుగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి అటవీ ప్రాంతంలో బెంగుళూర్‌కు చెందిన రబియా(22)ను మహారాష్ట్రకు చెందిన భర్త విక్రమ్ మన్వర్(28) స్పృహ కోల్పోయి ఉన్న భార్యను వదిలి వెళ్లాడు. బాధితురాలు రబియా వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన విక్రమ్ మన్వర్ తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం కాస్త ఒకరినొకరు ఇష్టపడి ప్రేమగా మారి 8 నెలలుగా సహజీవనం అనంతరం, ఇద్దరు ఈ నెల 4న పెండ్లి చేసుకున్నామని చెప్పింది. కాగా, వివాహం అనంతరం బెంగుళూర్ నుండి తన తల్లిదండ్రులు జీవనోపాధి కోసం వచ్చి నివాసముంటున్న మేడ్చల్ జిల్లా అల్వాల్‌కు రబియాను మన్వర్ కాపురానికి తీసుకొచ్చాడు. అయితే మన్వర్ తల్లిదండ్రులు అమ్మాయిని వదిలిపెట్టాలని, ఇంతకంటే మంచి అమ్మాయితో బాగా కట్నం ఇప్పించి పెళ్లి చేస్తామని ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా రబియాపై అత్తమామలు, భర్త ఒత్తిడి ఎక్కువైంది. ఇక భర్త ఆత్మహత్య చేసుకుని చావమంటూ రబియాపై దుర్భాషలాడాడు. దీంతో ప్రేమ పేరుతో మోసపోయానని మనస్తాపానికి గురైన రబియా శనివారం నిద్ర మాత్రలు వేసుకుని ఏడుస్తూ కూర్చుంది. అది గ్రహించిన మన్వర్ యువతిని బయటికి తీసుకెళ్లి, వదిలించుకోవాలననే నెపంతో బైక్‌పై తీసుకొచ్చి వంటిమామిడి అటవీ ప్రాంతంలో వదిలి వెళ్లినట్లుగా యువతి పేర్కొంది. ప్రేమ పేరుతో మోసపోయిన నాకు న్యాయం చేయాలనీ యువతి ఆవేదన వ్యక్తం చేసింది. యువతిని వదిలి వెళ్లడాన్ని గ్రహించిన స్థానికులు ములుగు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రి తరలించారు. అనంతరం యువతిని కుటుంబీకులకు అప్పగించారు.

# ఏడాదికి 12 వేలు..

(మొదటిపేజీ తరువాయి)

ఇందుకు సంబంధించి గణంకాలను వెల్లడించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులను కడుతూ.. మరోవైపు రైతు రుణమాఫీ కూడా నిధులు కేటాయించామని చెప్పారు. ఏడాది కాలంలోనే రూ.21వేల కోట్ల రూపాయలతో రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని.. భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రం కూడా ఏడాది కాలంలో ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని, తమ ప్రభుత్వం దేశానికే ఆదర్శమని చెప్పారు. రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు. వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు కూడా జమ చేస్తున్నామని తెలిపారు. సన్న వడ్లకు బోనస్ వేస్తున్నామని చెప్పారు. వ్యవసాయానికి తమ ప్రభు త్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు లేకుండానే.. గత ప్రభుత్వాలు కట్టించిన ప్రాజెక్టులతో పారే నీళ్లతో చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి వరి ధాన్యం అత్యధికంగా ఉత్పత్తి జరిగిందని చెప్పారు. సన్న వడ్లకు ఇచ్చే కనీస మద్దతు ధర కాకుండా ఎకరానికి రైతులకు 10 నుంచి 15 వేల రూపాయలు బోనస్ ద్వారా అందుతుందని చెప్పారు.

**అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్**

అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్ ఏర్పాటు చేస్తాం. ఔటర్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్‌రోడ్ మధ్య ఇండస్ట్రియల్, హౌసింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందించబోతున్నాం. రాష్ట్ర అప్పులపై భారాస నాయకులు పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస పాలకులు ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్,




ఆసుపత్రులు, ఉద్యోగుల జీపీఎఫ్, మిడ్ డే మీల్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలు రూ.40,154 కోట్లు. పదేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భారాస ప్రభుత్వం రూ.7,11,911 కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపింది. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు 2014 నాటికి ఏడాదికి చెల్లించాల్సిన అప్పు రూ.6,400 కోట్లు ఉండగా, పదేళ్లలో భారాస చేసిన అప్పుల వల్ల ఏడాదికి రూ.66,782 కోట్లు చెల్లించే దుస్థితికి భారాస తీసుకెళ్లింది. సన్నాలపై క్వింటాకు ఇస్తున్న రూ.500 బోనస్ ద్వారా ప్రతి ఏకరాకు రూ.10వేల నుంచి 15వేల వరకు అదనంగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోంది. ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి రైతులకు నేరుగా రూ.50,953 కోట్లు ఖర్చుచేసింది" అని భట్టి విక్రమార్క వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కింద రూ. 7,625 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రైతు బీమా బంద్ చేశారని.. తాము అధికారంలో వచ్చిన తర్వాత రైతులకు రైతు బీమా కట్టామని చెప్పారు. పంటలు నష్టపోతే ఎకరానికి రూ. 10 వేల చొప్పున చెల్లించామని తెలిపారు. ఇలా అన్ని విధాలుగా మొత్తంగా తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రైతుల కోసం రూ. 50 వేల కోట్లను ఖర్చు చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక భారం వేసి వెళ్లినప్పటికీ.. తాము నిబద్ధతో ప్రజల కోసం పని చేస్తూ, వనరులను సేకరిస్తూ ముందుకు వెళుతున్నామని చెప్పారు. తాము ప్రజలను మభ్యపెట్టే ఆలోచనలో లేమని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వంపై తప్పుడు కథనాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

**బీఆర్ఎస్ నేతలు చర్చకు సిద్ధమా**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక అంశాలపై తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని భట్టి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో రూ.7,11,911 కోట్ల అప్పులను తెలంగాణ ప్రజలకు మిగిల్చారని భట్టి ఆరోపించారు. వారి హయాంలో చేసిన అప్పులపై తాము ఎక్కడైనా చర్చకు సిద్ధమంటూ భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.

# గద్దర్ ఎంతో మందికి స్ఫూర్తిదాయం




(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. గద్దరన్న అర్ధదశాబ్దపు పోరాటం అని కొనియాడారు. పదవుల కోసం ఆశ పడకుండా తన తండ్రి పోరాటాన్ని, చరిత్రను రేపటి భావి తరానికి అందించడానికి మంచి ప్రయత్నాన్ని సూర్యం తీసుకున్నారన్నారు. ఈ ఐదు దశాబ్దాలలో జరిగిన ప్రతి పోరాటంలో గద్దరన్న ఉన్నారన్నారు. 'విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత ఉద్యమం ప్రతి దాంట్లో న్యాయం వైపున నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించాడు గద్దరన్న. మలిదశ ఉద్యమంలో గద్దర్ అన్నను కలిసే అదృష్టం కలిగింది. 100 ఉపన్యాసాల సారం గద్దరన్న ఒక్క పాట. చాలా సామాన్య పదాలతో ప్రజల హృదయాలల్లోకి చేరే విధంగా గద్దరన్న పాటలు ఉంటాయి' అని చెప్పారు. గద్దరన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, పాట ఉన్నన్ని రోజులు గద్దరన్న సజీవంగానే ఉంటారని చెప్పారు. పొడుస్తున్న పొద్దుమీద పాట తెలంగాణ ఉద్యమాన్ని, సమాజాన్ని ఉర్రుతలూగించి ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. 2008లో తెలంగాణ కోసం రాజీనామా చేసిన తెరాస ఎమ్మెల్యేలను, ఎంపిలపై తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి అభ్యర్థులను పెట్టాలని నిర్ణయిస్తే అది తప్పని వాదించిన వ్యక్తి గద్దర్. తెలంగాణ ఉద్యమానికి, కెసిఆర్ గారికి అండగా కూడా గద్దర్ నిలబడ్డారు. తూప్రాన్ లో నీళ్లులేవు హల్దీ వాగులో నుండి వాటిక చెరువు కి లిఫ్ట్ పెట్టాలని గద్దర్ కోరితే.. 8 నెలల్లో పూర్తి చేసి ఆయనతోనే ప్రారంభించామన్నారు. తెలంగాణ వచ్చాక జీహెచ్‌ఎంసీ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదని గద్దర్ లెటర్ రాస్తే, వారికీ వెంటనే ఒక్క సంతకంతో కేసీఆర్‌జీతాలు పెంచారని గుర్తు చేశారు. అది గద్దర్‌కు కేసీఆర్ఇచ్చిన గౌరవమని చెప్పారు. సిద్దిపేటలో గద్దరన్న విగ్రహం పెట్టడం తమకు చాలా గౌరమని, పెట్టించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. గద్దరన్న జీవిత చరిత్ర పైన ఒక డాక్యుమెంటరీ తీయాలని, దానికి తాను సహకారం అందిస్తానని పేర్కొన్నారు. స్వతంత్రం వచ్చి ఇన్ని ఏళ్ళు అవుతున్న ఇంకా సమాజంలో అసమానతలు ఉన్నాయని, అవి చెరిపేయాలంటే గద్దరన్న ఆలోచలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఎప్పటి వరకైతే ప్రభుత్వం ప్రజల ఆలోచనలను తీసుకవెళ్లదో, అణిచివేత ఉంటదో అక్కడ ప్రభుత్వ అవార్డులకు అర్థం లేదు అనే మాట ఆరోజు గద్దర్ చెప్పారన్నారు. నేడు నందిని సిధారెడ్డి తిరస్కరించి చూపించారన్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణ తల్లి చేతిలో బతుమ్మను మాయం చేసిన రేవంత్ రెడ్డి అవార్డు ఇస్తే, తృణప్రాయంగా తిరస్కరించిన నందిని సిద్దారెడ్డి గారు మన సిద్ధిపేట బిడ్డ కావడం నిజంగా గర్వకారణమన్నారు. త్వరలోనే గద్దర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని ఒక భారీ బహిరంగ సభను సిద్దిపేటలో నిర్వహించుకుందామని చెప్పారు.

# ఆ ఎన్‌కౌంటర్ బూటకం

- మృతుల్లో ఏడుగురు గ్రామీణులు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- మావోయిస్టుల లేఖ కలకలం



**హైదరాబాద్, డిసెంబర్15:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లోని అటవీప్రాంతంలో ఈ నెల 12న భారీ ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు డివిజనల్ కమిటీ పేరిట ఓ లేఖ విడుదల చేసింది. ఏడుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు పోలీసులు చెబుతున్నది పూర్తిగా అబద్ధమని, ఇది ఎన్‌కౌంటర్ కాదని స్పష్టంచేసింది. మృతులు ఏడుగురిలో ఐదుగురు గ్రామీణులు ఉన్నారని తెలిపింది. ఈ నెల 10 నుంచి 13 వరకు నారాయణపూర్ జిల్లా మాడ్ డివిజన్‌లోని ఇంద్రావతి ప్రాంతంలో కాగర్ ఆపరేషన్‌లో భాగంగా సుమారు 4వేల మంది పోలీసులు, పారా మిలటరీ సిబ్బందితో మళ్లీ పెద్ద దమనకాండ నిర్వహించారని తెలిపింది. 11న 11 గంటల ప్రాంతంలో లకేవేద పెండలో వ్యవసాయం చేస్తున్న వారిని చుట్టుముట్టిన పోలీసులు వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని పేర్కొంది. ఇందులో ముగ్గురు లేదా నలుగురు గ్రామీణులు చనిపోయారని, ఏడుగురు గాయపడ్డారని వెల్లడించింది. చాలామందిని పట్టుకుని తీసుకెళ్లారని వెల్లడించింది. మరోవైపు ఈ నెల 12న కుమ్మం అడవిలో అనారోగ్యంతో ఉన్న పీఎల్‌జీఏ సభ్యుడు కార్తీక్ దాదా(62), అతడి సహాయకుడు రమీనుపోలీసులు చుట్టుముట్టి కాల్చి చంపారని పేర్కొంది. ప్రణాళికాబద్ధంగా ఈ మారణకాండ జరిపారని లేఖలో పేర్కొంది. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది.



# ఐ యామ్ సారి!

- జర్నలిస్టుకు మోహన్‌బాబు క్షమాపణలు
- ఆసుపత్రికి వెళ్లి మాట్లాడిన నటుడు
- ఆయన వెంట విష్ణు కూడా..

**హైదరాబాద్, డిసెంబర్15:** జర్నలిస్ట్‌పై మైక్‌తో దాడి చేసిన మోహన్‌బాబు.. ఎట్టకేలకి ఐదు రోజుల తర్వాత బహిరంగ క్షమాపణలు చెప్పారు. అలానే జర్నలిస్ట్ సంఘాలకి కూడా క్షమాపణలు చెప్పారు. సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు ఎట్టకేలకు జర్నలిస్ట్ సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పారు. గత మంగళవారం జల్‌పల్లిలో మంచు మనోజ్ వెంట మోహన్ బాబు ఇంట్లోకి వెళ్లిన జర్నలిస్ట్ రంజిత్.. ఇష్యూపై మోహన్ బాబు స్పందన తెలుసుకునేందుకు ప్రయత్నించారు. కానీ.. మోహన్ బాబు క్షణికావేశంలో జర్నలిస్ట్ వద్ద నుంచి మైక్ అందుకుని అతడిపై దాడి చేశారు. దాంతో.. గాయాలతో ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో జర్నలిస్ట్ చికిత్స పొందుతున్నారు. మోహన్ బాబు చర్యని ఖండిస్తూ జర్నలిస్ట్ సంఘాలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తూ.. నిరసనలు తెలియజేశాయి. మోహన్ బాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. మరోవైపు మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకి హాజరవుకుండా మోహన్ బాబు కాలయాపన చేస్తున్నారు. అయితే.. ఐదు రోజుల నిరీక్షణ తర్వాత ఎట్టకేలకి మోహన్ బాబు దిగొచ్చారు. జర్నలిస్ట్ సంఘాలకు క్షమాపణలు యశోద ఆసుపత్రికి ఆదివారం వెళ్లిన మోహన్ బాబు.. జర్నలిస్ట్ రంజిత్‌ను పరామర్శించి క్షమాపణలు చెప్పారు. అక్కడే ఉన్న అతని కుటుంబ సభ్యులకు కూడా క్షమాపణలు చెప్పి.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇదే క్రమంలో దాడిపై జర్నలిస్ట్ సంఘాలకు కూడా క్షమాపణలు చెప్పాలని జర్నలిస్ట్ కోరడంతో.. మోహన్ బాబు బహిరంగ క్షమాపణలు కోరారు. మోహన్ బాబు వెంట ఆసుపత్రికి మంచు విష్ణు కూడా వెళ్లారు.

**మంచు ఫ్యామిలీలో మళ్లీ గొడవలు**

మంచు ఫ్యామిలీలో మరోసారి వివాదం రాజుకుంది. శనివారం రాత్రి జల్ పల్లిలోని తన నివాసంలో స్నేహితులతో కలిసి మంచు మనోజ్ పార్టీ ఏర్పాటు చేశాడు. పార్టీకి విద్యుత్ సరఫరా కోసం మనోజ్ బయట నుండి జనరేటర్లను తెప్పించాడు. మనోజ్ ఇంట్లో పార్టీ ఏర్పాటు చేయడంతో అసహనానికి గురైన విష్ణు.. తన మనుషులతో మనోజ్ ఇంట్లోని జనరేటర్లలో పంచదార వేయించాడు. ఈ విషయాన్ని మనోజ్ గమనించడంతో మరోసారి అన్నదమ్ముల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకున్నట్టు సమాచారం. విష్ణు మనుషులు జనరేటర్‌లో పంచదార పోయడానికి సంబంధించిన ఆధారాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు మనోజ్ రెడీ అయ్యాడు. దీంతో మరోసారి మంచు ఫ్యామిలీ వివాదం మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఆదివారం (డిసెంబర్ 15) రాత్రి 7 గంటలకు పహడి షరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మనోజ్ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఇప్పటికే శాంతి భద్రతలకు విగాథం కలిగించవద్దంటూ మనోజ్, విష్ణు ఇద్దరితో రాచకొండ సీపీ బాండ్ రాయించుకోగా.. వీరి మధ్య మరోసారి గొడవ జరగడం హాట్ టాపిక్‌గా మారింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
16 డిసెంబర్
2024





# నీ సంగతి చెబుతా..

- జగిత్యాల ఎమ్మెల్యేకు కవిత మాస్ వార్నింగ్
- ఏ మొహం పెట్టుకుని కాంగ్రెస్‌లోకి వెళ్లినవని ప్రశ్న
- ఉద్యమ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ
- కేసులకు భయపడేది లేదని స్పష్టీకరణ



**జగిత్యాల :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కేసీఆర్ బొమ్మతో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఎలా వెళ్లారని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి నిధులు తెచ్చారని కవిత ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాట్ కామెంట్స్ చేశారు.. మాజీ సీఎం కేసీఆర్ బొమ్మతో గెలిచిన సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. ఏ మొహం పెట్టుకుని కాంగ్రెస్‌లోకి వెళ్లినవ్ సంజయ్ అని ప్రశ్నించారు. ఆదివారం జగిత్యాలలో ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... ఏడాది నుంచి నియోజకవర్గం కోసం రూపాయి తేలేదు.. ఎందుకు పోయినవ్ బాబు అని నిలదీశారు. ప్రజలను వదిలి.. పైసల కోసం వెళ్లినోడు నాయకుడా అని ధ్వజమెత్తారు. తట్టేడు మట్టి తీయలేదు.. అసెంబ్లీకి ఏ మొహం పెట్టుకుని పోతావ్ అని కవిత ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వచ్చి జగిత్యాలలో ప్రచారం చేసినా కూడా బీఆర్ఎస్ అభ్యర్థి అయిన సంజయ్ కుమార్‌ను ప్రజలు గెలిపించారని, అంటే ఇది సంజయ్ వ్యక్తిగత గెలుపు కాదని, కేసీఆర్ గెలుపుగా చూడాలని సూచించారు. నాయకులు పార్టీ మారినంత మాత్రానా బీఆర్ఎస్ పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు పటిష్టంగా ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో గులాబీ జెండాను ఎగరేస్తామన్నారు.

### ఉద్యమ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు భూమిపూజ

జగిత్యాల పట్టణంలో ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి వచ్చిన కవితకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహ భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని జీవోలు, గెజిట్‌లు జారీ చేసినా ఉద్యమ తెలంగాణ తల్లినే తాము ప్రతిష్టించుకుంటామని తేల్చిచెప్పారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఉద్యమకాలంలో తెలంగాణ తల్లి తమకు స్ఫూర్తిని ఇచ్చిందని.. ధైర్యాన్ని నింపిందని తెలిపారు. ఉద్యమ తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మను కాపాడుకొని విశ్వమంతా వ్యాపింపజేస్తామని తెలిపారు. తెలంగాణ అస్థిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని గ్రామ గ్రామాన ఎండగడుతామని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్టిస్తామని ప్రకటించారు.

### ఉపాధ్యాయులు, సిబ్బంది సమస్యలపై ఆరా

సారంగాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలను కవిత సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో ముచ్చటించి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కస్తూర్బా పాఠశాలలకు పెంచిన డైట్‌చార్జీలను ప్రభుత్వం వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 472 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నారన్నారు. పెంచిన డైట్ చార్జీలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా విద్యార్థినులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని, ఈ విషయంపై రాజీ పడవద్దని ప్రభుత్వానికి సూచించారు. సర్వశిక్ష అభియాన్ పథకం కింద పనిచేస్తున్న వారితో పాటు కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లను రెగ్యులరైజ్ చేస్తానని గతంలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో జూనియర్ కాలేజీని మంజూరు చేయాలని స్థానికులు కోరారని, దాంతో అప్పటి సీఎం కేసీఆర్ జూనియర్ కాలేజీని మంజూరు చేశారని, త్వరలో అది ప్రారంభమవుతుందని చెప్పారు. కేసీఆర్ ఏ లక్ష్యంతో అయితే గురుకుల పాఠశాలల పెట్టారో ఆ లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా ఈ ప్రభుత్వం వ్యవరించిందని, దానికి ప్రతిచర్యగా బీఆర్ఎస్ ఉద్యమిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన ఉద్యమాల వల్ల ప్రభుత్వం గురుకుల పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచడం, నూతన డైట్ మెనూను విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అన్ని రంగాల్లో తిరోగమనం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబర్15:** తెలంగాణ రాష్ట్రం అన్నీ రంగాల్లో తిరోగమిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో పదేళ్ల పాటు రాష్ట్రం అద్భుతంగా పురోగమించిందని ఆయన గుర్తు చేశారు. కానీ, ప్రస్తుతం నేడు సీఎం రేవంత్ రెడ్డి అనుభవరాహిత్యం, అసమర్థత, అవినీతి పాలన కలగలిసి రాష్ట్రం తిరోగమిస్తోందని కేటీఆర్ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధి తెలిపేందుకు రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాక ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లలో వృద్ధి కనిపిస్తుందని ఆయన చెప్పారు.

### కాంగ్రెస్ విఫలమైంది..

తెలంగాణ ఆర్థికాభివృద్ధి తెలిపేందుకు రవాణా శాఖ ఆదాయం ఒక ముఖ్యమైన సూచీ అని కేటీఆర్ చెప్పారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగుంటే బైకులు, కార్లే కాక ఇతర భారీ వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లలో వృద్ధి కనిపిస్తుందని ఆయన చెప్పారు. కానీ తెలంగాణలో నేడు రిజిస్ట్రేషన్లు తగ్గి, ఆదాయం తిరోగమనంలో ఉందని ఆయన చెప్పుకొచ్చారు. పొరుగున ఉన్న ఐదు రాష్ట్రాలూ ఈ ఏడాది రవాణా శాఖ ఆదాయంలో 8 నుంచి 32 శాతం వృద్ధిని నమోదు చేశాయని కేటీఆర్ తెలిపారు. కానీ తెలంగాణ ఒక్కటే గతేడాది కంటే తక్కువ వృద్ధిని నమోదు చేయడం రాష్ట్రంలోని విఫల ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోందని మాజీ మంత్రి అన్నారు.

### రేవంత్ రెడ్డి ఉద్దేశం అదే..


సీఎం రేవంత్ రెడ్డి పాలన గాలికొదిలేసి కక్షసాధింపు చర్యలకే పూర్తి సమయం కేటాయించారని ఆరోపించారు. అలాంటప్పుడు ఫలితాలు ఇలా కాక మరెలా ఉంటాయంటూ ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మానసికస్థితి రోజురోజుకూ దిగజారుతోందని మాజీ మంత్రి కేటీఆర్ చురకలు అంటించారు. బ్యాగు నిండా నోట్ల కట్టలతో పట్టుబడి జైలు జీవితం అనుభవిం చిన తర్వాత, అందరూ అదే అనుభవించాలనే ఉద్దేశంతో ఆయన ఉన్నారని కేటీఆర్ చెప్పారు.

### జైలుకు పంపిస్తారా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకంపైన, తమ కంపెనీ కార్యకలాపాలపైన ఆ పథకం ప్రభావాన్ని వ్యక్తపరిచినందుకు ఎల్ అండ్ టీ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను జైలుకు పంపిస్తానంటూ రేవంత్ రెడ్డి మాట్లాడటాన్ని కేటీఆర్ ఖండించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన సంస్థల అధిపతులను జైలుకు పంపిస్తానంటూ ముఖ్యమంత్రి బెదిరింపులకు పాల్పడటం ఏంటని మాజీ మంత్రి ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంలో చేసిన వ్యాఖ్యలు దిగజారుతున్న ఆయన మానసిక స్థితికి అద్దం పడుతున్నట్లు కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇలాంటి నిర్లక్ష్యమైన వ్యాఖ్యలతో పరిశ్రమలకు ఆయన ఏ సందేశం పంపుతున్నారని ప్రశ్నించారు. ఇదేనా రాహుల్ గాంధీ దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి తమ పార్టీ ముఖ్యమంత్రులకు నేర్పించిన గొప్ప వ్యూహం అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు.

### బహిరంగ లేఖ కాదు అభద్రతా లేఖ...

పీసీసీ చీఫ్ బహిరంగ లేఖపై జనాలు నవ్వుకుంటున్నారని కేటీఆర్‌పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, కేసీఆర్ జపం వీడరా? అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. పాలన చేతగాక ప్రతిపక్ష నాయకుడికి లేఖలు రాయడం ఏంటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు. ఎప్పుడైనా అధికారంలో ఉన్నోళ్లకు ప్రతిపక్షాలు ప్రజా సమస్యలు గుర్తు చేస్తూ బహిరంగ లేఖలు రాయడం ఆనవాయితీ. కొత్త పోకడకు కాంగ్రెస్‌శ్రీకారం చుట్టిందని విమర్శించారు. హామీలు అమలు చేయాల్సిన హోదాలో ఉండి, సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యతలో ఉండి ప్రతిపక్షం సహకరించాలంటూ వారి అసమర్థతను హస్తం పార్టీ అధ్యక్షుడు బయటపెట్టుకున్నారన్నారు.



# కొత్తగూడెం జిల్లాలో పెద్ద పులి సంచారం

**కొత్తగూడెం, డిసెంబర్ 15 :** తెలంగాణలో పులుల సంచారం ఆందోళన కలిగిస్తున్నది. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం అడవుల్లో పులి తిరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. పులి పెద్దగా గాండ్రిస్తుందని రైతులు చెబుతున్నారు. దీనిపై అటవీ శాఖను వివరణ కోరగా.. పాద ముద్రలు గుర్తించామని పేర్కొన్నారు. అయితే ఆ పాదముద్రలు పులివా? కావా? అనేది స్పష్టంగా తెలియలేదని తెలిపారు. అటవీ శాఖ అధికారులు పులి కదలికలను గుర్తించే పనిలో పడ్డారు. 15 రోజుల క్రితం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ మహిళపై పులి దాడి చేసి ప్రాణాలు తీసింది. కాగజ్‌నగర్ మండల పరిధిలోని బెంగాలీ క్యాంపు ఆరో నెంబర్ విలేజ్ సమీపంలో గన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ పత్తి ఏరడానికి చేనుకు వెళ్లింది. ఆమె పత్తి ఏరుతున్న సమయంలో వెనక నుంచి పెద్ద పులి వచ్చి దాడి చేసింది. వెంటనే ఆమె కేకలు వేయడంతో పులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. 20 రోజుల క్రితం మంచిర్యాల జిల్లాల్లో రెండు పులులు ప్రవేశించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో ఒకటి మహారాష్ట్ర అడవిల్లోకి తిరిగి వెళ్లిపోయింది. కానీ, మరో పులి మాత్రం ఇక్కడే ఉండిపోయినట్లు తెలిసింది. పులి కదలికలను గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు ట్రాప్ కెమెరాలు అమర్చారు. 12 రోజుల క్రితం మంచిర్యాల జిల్లాల బెల్లంపల్లి మండలంలో శివారు అటవీ ప్రాంత గ్రామం చర్లపల్లిలో చిరుతపులి సంచరించింది. చుట్టు పక్కాల గ్రామాల వారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఆదిలాబాద్‌జిల్లా బజార్‌హత్నూర్‌మండలం డెడ్రా గ్రామంలో శనివారం బహిర్భూమికి వెళ్లిన మహిళ భీమాబాయిపై చిరుత దాడి చేయగా, తీవ్రంగా గాయపడింది. ఆమెను జిల్లాకేంద్రంలోని దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఖమ్మం జిల్లాలో పులులు, చిరుత పులుల సంచారంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

# అరాచక పాలన మరువం

(మొదటిపేజీ తరువాయి)



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు పోరాటం చేసిందెవరు? దాని ఫలితం అనుభవించిందెవరు? మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే అప్పుల పాలు చేసిందెవరు? అంటూ సవాలక్ష ప్రశ్నలతో బహిరంగ లేఖను పంపారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మీ(బీఆర్ఎస్) పార్టీ నాయకులు ఫేక్ ప్రచారం చేస్తున్నా రు. సెంటిమెంట్ పేరుతో రెండుసార్లు అధికారంలోకి వచ్చి మీరు గడీల పాలనతో ప్రజలకు కన్నీరు మిగిల్చారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్యమించి.. పీఠమెక్కాక మాయమాటలతో పాలించారని కేసీఆర్ పాలనపై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. మీ అల్లుడు హరీశ్ రావు పెట్రోల్ డబ్బాతో అగ్గిపుల్లతో డ్రామాలు చేసి అమాయక యువతను బలిదానాలవైపు ప్రోత్సహించారనేది వాస్తవం కాదా? మేము అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 54 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే రికార్డు నెలకొల్పామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. ఉద్యమ సమయంలో ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పిన మీరు అధికారంలోకి వచ్చాక మీ ఫ్యామిలీకి ఉపాధి కల్పించుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీకు, మీ అనుచరులకు ఒక ఏటీఎంలా మారిందనేది అక్షర సత్యమని కేసీఆర్‌ను ఉద్దేశించి మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మీరు మార్చింది వాస్తవం కాదా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవ సుందరీకరణలో అవినీతి జరిగిందని మీ పుత్రరత్నం గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్ కోసం రూ. 150 కోట్లే ఖర్చు చేశాం. మూసీ కోసం అదనంగా ఖర్చు చేయలేదని మీరు గుర్తించాలని మహేశ్ కుమార్ గౌడ్.. కేసీఆర్ కు రాసిన బహిరంగ లేఖ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ తల్లి, గేయానికి గుర్తింపు లేదని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తమ పాలనలో ఆనందంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకులు చెవాకులు మానుకోవాలి. ముఖ్యంగా కేటీఆర్, హరీశ్ రావు, కవితను కేసీఆర్ అదుపులో పెట్టాలి. దళితుడిని సీఎం చేస్తానని మాయమాటలతో సీఎం పీఠం ఎక్కి.. అధికారం చేపట్టగానే కుటుంబ పాలన సాగించావు. రాష్ట్రాన్ని పదేళ్లు మీ కుటుంబ సభ్యుల కబంధ హస్తాల్లో బంధించావు.. కేసీఆర్ మీరు చేసిన అరాచకాన్ని ప్రజలు ఎప్పటికీ మరువరు అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

# అమిత్‌షా పర్యటన వేళ అపశృతి

- ఛత్తీస్‌గఢ్ లో ఐఈడీ పేలి జవాన్‌కు గాయాలు
- 9మంది మావోయిస్టుల అరెస్టు
- భద్రతా చర్యలు కట్టుదిట్టం

**కాంకేర్:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్ పర్యటన సందర్భంగా భద్రతా సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో కాంకేర్‌జిల్లాలో ఓ చోట మావోయిస్టులు అమర్చిన ఐఈడీని గుర్తించారు. దానిని నిర్వీర్యం చేసే సమయంలో ఒక్కసారిగా పేలడంతో భద్రతా సిబ్బంది ఒకరికి గాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం భద్రతా సిబ్బంది ఆ ప్రాంతంలో విస్తృత సోదాలు నిర్వహించారు. పేలుడు పదార్థాలతో తిరుగుతున్న 9 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. అమిత్ షా పర్యటన వేళ ఈ ఘటన చోటుచేసుకోవడంతో హై అలర్ట్ ప్రకటించారు. ఘటనా స్థలంలో భద్రతా దళాలను భారీగా మోహరించినట్లు కాంకేర్ జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం రాయ్‌పుర్ చేరుకున్నారు. రాయ్‌పుర్, బస్తర్ జిల్లాల్లో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు.

# అల్విదా ఉస్తాద్

## తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ కన్నుమూత
## అమెరికాలో చికిత్స పొందుతూ మృతి



**న్యూ ఢిల్లీ, డిసెంబర్15:** ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ (73) కన్నుమూశారు. రక్తపోటు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతుండగానే ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. తబలా మ్యాస్ట్రోగా ప్రఖ్యాతిగాంచిన జాకీర్ హుస్సేన్ 1951 మార్చి 9న ముంబయిలో జన్మించారు. ప్రముఖ తబలా వాయిద్యకారుడు అల్లారఖా పెద్ద కుమారుడైన జాకీర్‌హుస్సేన్ చిన్నప్పటి నుంచే తండ్రి బాటలో నడిచారు. ఈ క్రమంలో హిందుస్థానీ క్లాసికల్ మ్యూజిక్, జాజ్ ఫ్యూజన్‌లో నైపుణ్యం సాధించి తనదైన ముద్ర వేశారు. 1990లో సంగీత్‌నాటక అకాడమీ అవార్డు, 2009లో గ్రామీ పురస్కారం అందుకున్నారు. 1988లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్, 2023లో పద్మవిభూషణ్‌తో కేంద్ర ప్రభుత్వం ఆయన్ను గౌరవించింది. జాకీర్ హుస్సేన్ భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొత్తంగా ఐదు గ్రామీ అవార్డులు గెలుచుకున్న ఆయన.. ఈ ఏడాది ప్రారంభంలో 66వ గ్రామీ అవార్డుల్లో మూడింటిని కైవసం చేసుకున్నారు. ఆరు దశాబ్దాల పాటు సాగిన సంగీత ప్రయాణంలో.. మన దేశంతోపాటు ఎంతో మంది అంతర్జాతీయ కళాకారులతో కలిసి పనిచేశారు.

### పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి

జాకీర్ హుస్సేన్ మరణం పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. భారతీయ శాస్త్రీయ సంగీతానికి, అంతర్జాతీయ మ్యూజిక్‌కు వారధిగా నిలిచిన లెజెండరీ తబలా విద్వాంసుడంటూ కొనియాడారు. 'మీ వారసత్వం సజీవంగా ఉంటుంది ఉస్తాద్ జీ' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. జాకీర్ హుస్సేన్ మరణం తనను తీవ్ర షాక్‌కు గురిచేసిందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. లెజెండరీ తబలా విద్వాంసుడి మరణం భారత్‌కే కాదు.. యావత్ ప్రపంచానికే తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన సంగీతం ఎప్పటికీ హృదయాల్లో ప్రతిధ్వనిస్తుంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సంగీత ప్రపంచంలో ఆయన లేని లోటు భర్తీ చేయలేనిదన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. జాకీర్ హుస్సేన్ మరణవార్త తనను తీవ్రంగా బాధించిందని మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నారు. సంగీత ప్రపంచానికి ఈరోజు విషాదకరమైనదిగా పేర్కొన్నారు.




# యాదగిరి నాధుని దర్శించి తరించిన భక్తులు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధి ఆదివారం భక్తజనులతో సందడి చేసింది. ఎటు చూసినా భక్తుల పరవశమే... శ్రీలక్ష్మి నరసింహ పాహిమాం... పాహిమాం!! అంటూ నరసింహున్ని కొలుస్తూ నిత్య పూజలో మమేకమయ్యారు. ఉదయం 3:30 గంటల నుంచి మొదలైన పూజలు రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. వివిధ పూజలు, ప్రసాద విక్రయాలు... ఆర్జిత దర్శనాలు, నిత్య కైంకర్యాలతో రూ. 57, 65, 859 ఆదాయం శ్రీలక్ష్మీ నరసింహుని ఖజానాకు చేరింది. తెలంగాణ హైకోర్టు జడ్జి ఎస్.వీ. శ్రావణ్ కుమార్ శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రత పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. భాస్కరరావు దగ్గర నుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీవారి ప్రసాదాన్ని శేష వస్త్రాన్ని అందజేశారు.

సుప్రభాత సేవతో మొదలైన శ్రీవారి కైంకర్యాలలో నిజాభిషేకం, నిత్య కళ్యాణం, జోడు సేవల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీస్వామి వారి ఆదాయము
రూ. 57,65,859
శ్రీ స్వామి వారికి 2200 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.
కళ్యాణ కట్ట 1,10,000/-
ప్రధాన బుకింగ్ 7,24,300 /-
కైంకర్యములు 300 /-
సుప్రభాతం 20,500 /-
బ్రేక్ దర్శనం 3,62,100 /-
వ్రతాలు 2,94,900 /-
వాహన పూజలు 24,700 /-
VIP దర్శనం 5,20,350 /-
ప్రచారశాఖ 88,500 /-
పాతగుట్ట 88,710 /-
కొండపైకి వాహన ప్రవేశం 7,00,000/-
యాదఋషి నిలయం 3,16,409 /-
సువర్ణ పుష్పార్చన 97,000 /-
శివాలయం 11,000 /-
శాశ్వత పూజలు 17,500 /-
పుష్కరిణ 1650 /-
ప్రసాదవిక్రయం 21,79,740 /-
లాకర్స్ 480 /-
అన్నదానం 30,752 /-
విమాన గోపురం 8110 /-
లీజెస్ 1,68,858 /-










# భువనగిరి సావర్కర్ చౌరస్తాలో వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ





భువనగిరి, రోమింగ్ న్యూస్: భువనగిరి సావర్కరార్ చౌరస్తాలో అయ్యప్ప స్వామి పడిపూజ అతి వైభవంగా జరిగింది. దీనికి వేల సంఖ్య లో అయ్యప్ప స్వాములు మరియు మహిళలు భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమము భువనగిరి గురుస్వామి విశ్వరూప గురుస్వామి మరియు భువనగిరి గురుస్వాములు సావర్కర్ సేవాసమితి అధ్వర్యంలో ఘనంగా జరిగినది. మరియు ఇట్టి కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాసనిపుణులు శ్రీ అప్పాలప్రసాద్ ప్రసంగం అందరిని ఆకట్టుకున్నది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
16 డిసెంబర్
2024








## హెడ్, స్మిత్ సెంచరీలు..
## ఆసీస్ స్కోరు 405/7
## బుమ్రాకి ఐదు వికెట్లు

# భారీ స్కోర్ దిశగా ఆస్ట్రేలియా




**గబ్బా:** గబ్బా టెస్టులో టాస్ నెగ్గిన భారత్‌కు పెద్దగా కలిసిరాలేదు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా భారీ స్కోరు సాధించి పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తోంది. ట్రావిస్ హెడ్ (152), స్టీవ్ స్మిత్ (101) సెంచరీలు బాదేశారు. రెండో రోజు ఆట ముగిసేసమయానికి ఆస్ట్రేలియా ఏడు వికెట్ల నష్టానికి 101 ఓవర్లలో 405 పరుగులు చేసింది. క్రీజ్‌లో అలెక్స్ కేరీ (45), మిచెల్ స్టార్క్ (7) ఉన్నారు. భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అతడి టెస్టు కెరీర్‌లో 12వ సారి ఈ ఘనత సాధించాడు. తొలి రోజు కేవలం 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాగింది. వర్షం కారణంగా మ్యాచ్ జరగలేదు. దీంతో రెండో రోజు ఆట అరగంట ముందుగానే ప్రారంభమైంది. వర్షంతో పిచ్ ఉదయం బౌలింగ్‌కు సహకరించింది. దీనిని ఉపయోగించుకున్న బుమ్రా స్వల్ప వ్యవధిలో వికెట్లు తీశాడు. ఓవర్‌నైట్ 28/0 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్‌కు బుమ్రా చుక్కలు చూపించాడు. ఓపెనర్లు నాథన్ మెక్‌స్వీనీ (9), ఉస్మాన్ ఖవాజా (21)ను బుమ్రా ఔట్ చేశాడు. అనంతరం మార్నస్ లబుషేన్ (12) భారత బౌలింగ్ ఓర్పును పరీక్షించాడు. స్టీవ్ స్మిత్‌తో కలిసి మూడో వికెట్‌కు 37 పరుగులు జోడించాడు. నితీశ్ కుమార్ అద్భుతమైన బంతితోపాటు విరాట్ సూపర్ క్యాచ్‌తో లబుషేన్ పెవిలియన్‌కు చేరాడు. లబుషేన్ ఔట్ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన ట్రావిస్ హెడ్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. మరోవైపు స్మిత్ నిలకడగా పరుగులు రాబట్టాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు ఏకంగా 241 పరుగులను జోడించడం గమనార్హం. ఈ క్రమంలో సెంచరీలు పూర్తి చేసుకున్నారు. హెడ్‌కిది 9వ శతకం కాగా.. భారత్‌పై మూడోది కావడం గమనార్హం. ఇక స్మిత్ దాదాపు 25 ఇన్నింగ్స్‌ల తర్వాత సెంచరీ చేశాడు. అయితే, మరింత ప్రమాదకరంగా మారిన వీరిద్దరిని బుమ్రా విడదీశాడు. స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు తీసి బుమ్రా భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. మిచెల్ మార్ష్(5) పెద్దగా పరుగులు చేయకపోయినా.. కెప్టెన్ పాట్ కమిన్స్(20) కూడా విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అలెక్స్ కేరీతో కలిసి 58 పరుగులు జోడించాడు. ఇవాళ మ్యాచ్‌ను ఉదయం అరగంటతోపాటు చివర్లోనూ పొడిగించారు. దీంతో 88 ఓవర్ల ఆట జరిగింది. ఒక్క రోజులో మొత్తం 377 పరుగులను ఆసీస్ రాబట్టింది.

## రోహిత్ శర్మ కెప్టెన్సీపై ట్రోలింగ్..!

భారత కెప్టెన్ రోహిత్ శర్మ కెప్టెన్సీపై మరోసారి చర్చ సాగుతున్నది. పేలవమైన కెప్టెన్సీపై సోషల్ మీడియా వేదికగా మరోసారి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో రోహిత్ కెప్టెన్సీపై విమర్శలు గుప్పిస్తున్నారు. మూడో టెస్ట్ రెండురోజు తొలి సెషన్‌లోనే టీమిండియా శుభారంభం చేసింది. తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా. అయితే, ఆ తర్వాత ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈ క్రమంలోనే ఇద్దరు సెంచరీలు సాధించారు. ఆస్ట్రేలియా స్కోరు 317 వద్ద నాలుగో దెబ్బకు తగిలింది. స్టీవ్ స్మిత్ పెవిలియన్‌కు చేరాడు. 75 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియాను స్మిత్-హెడ్ జోడీ 317 పరుగుల వరకు తీసుకెళ్లారు. నాలుగో వికెట్‌కు 242 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రోహిత్ నిర్ణయాన్ని సైతం అభిమానులు విమర్శించారు. అదే సమయంలో మ్యాచ్‌లో రోహిత్ అనుసరించిన వ్యూహాలపై సైతం విమర్శలు గుర్పించారు. స్మిత్, ట్రావిస్ హెడ్ బ్యాటింగ్ సమయంలోనూ సరిగ్గా ఫీల్డింగ్ సెట్ చేకపోవడంతో పరిస్థితిని ఇద్దరూ బ్యాటర్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారని విమర్శించారు. అభిమానులతో పాటు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సైతం రోహిత్ కెప్టెన్సీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెడ్ బ్యాటింగ్ సమయంలో అల్ట్రా డిఫెన్సివ్ ఫీల్డ్‌ని సెట్ చేశాడని.. అది పేలవంగా ఉందంటూ విమర్శించారు. ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ సైతం రవిశాస్త్రితో ఏకీభవించాడు. ట్రావిస్ హెడ్‌పై దూకుడుగా వైఖరిని అవలంభించాల్సి ఉందని చెప్పాడు. మరో వైపు మాజీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, సంజయ్ బంగార్ సైతం రోహిత్ వ్యూహాలపై విమర్శలు గుప్పించారు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టును భారీ స్కోరు దిశగా నడిపించిన ఈ మ్యాచ్‌లో రోహిత్ ప్లాన్ ఇప్పటి వరకు ఫలించలేదన్నారు. ట్రావిస్ హెడ్ వరుసగా టీమిండియాపై రెండో సెంచరీ సాధించగా.. స్మిత్ సైతం 17 నెలల తర్వాత టెస్టుల్లో తొలి సెంచరీను నమోదు చేశాడు. ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. టీమిండియా తరఫున టీమిండియా బౌలర్ జస్ప్రీత్ బుమ్రా 5 వికెట్లు పడగొట్టగా.. నితీశ్‌రెడ్డి, మహ్మద్ సిరాజ్ చెరో వికెట్ తీశారు.




## చరిత్ర సృష్టించిన స్టీవ్ స్మిత్

ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఎట్టకేలకు టెస్టుల్లో సెంచరీ కరువు తీర్చుకున్నాడు. గబ్బా వేదికగా భారత్‌తో జరుగుతున్న మూడో టెస్టులో స్మిత్ (101, 190 బంతుల్లో 12 ఫోర్లు) శతకం బాదాడు. అతను 18 నెలల తర్వాత టెస్టుల్లో సెంచరీ చేయడం గమనార్హం. ట్రావిస్ హెడ్‌తో కలిసి స్మిత్ నాలుగో వికెట్‌కు 241 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పై అత్యధిక సెంచరీలు (15) చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు రికీ పాంటింగ్ (14 సెంచరీలు) పేరిట ఈ రికార్డు ఉండేది. జో రూట్ (13), వివ్ రిచర్డ్స్ (11), కుమార సంగక్కర (11) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అన్ని ఫార్మాట్లలో కలిపి భారత్‌తో 89 మ్యాచ్‌లు ఆడిన పాంటింగ్ టెస్టులు ఎనిమిది, వన్డేల్లో ఆరు సెంచరీలు చేశాడు. టీమ్‌ఇండియాపై స్మిత్ ఇప్పటివరకు వన్డేల్లో ఐదు, టెస్టుల్లో 10 సెంచరీలు బాదాడు. స్మిత్ మరో ఘనత కూడా అందుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమ్‌ఇండియాపై ఎక్కువ సెంచరీలు (10) చేసిన జో రూట్ రికార్డును సమం చేశాడు. ఈ జాబితాలో గ్యారీ సోబర్స్ (8), వివ్ రిచర్డ్స్ (8), పాంటింగ్ (8) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక, భారత్, ఆసీస్ మధ్య టెస్టుల్లో అత్యధిక సెంచరీలు (10) చేసిన రెండో ఆటగాడిగా స్మిత్ నిలిచాడు. సచిన్ తెందూల్కర్ (11) అగ్రస్థానంలో ఉన్నాడు.




## ముగిసిన డబ్ల్యూపీఎల్ వేలం..

మహిళల ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్ కోసం బెంగళూరు వేదికగా జరిగిన ప్లేయర్ల మినీ వేలం ముగిసింది. 19 స్లాట్‌ల కోసం జరిగిన ఈ ఆక్షన్‌లో 120 మంది ఆక్షన్‌లో పాల్గొన్నారు. భారత అన్‌క్యాప్‌డ్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ సిమ్రాన్ షేక్ అత్యధిక ధర దక్కించుకుంది. ఆమె కోసం గుజరాత్ జెయింట్స్ రూ.1.90 కోట్లు వెచ్చించింది. సిమ్రాన్ బేస్ ధర రూ.10 లక్షలు కాగా.. ఢిల్లీ, గుజరాత్ పోటీపడ్డాయి. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డియాండ్రా డాటిన్ రూ.1.70 కోట్లకు గుజరాత్ జెయింట్స్ సొంతం చేసుకుంది. ఆమె కనీస ధర రూ. 50 లక్షలు కాగా.. గుజరాత్, యూపీ వారియర్స్ పోటీపడ్డాయి. చివరకు గుజరాత్ దక్కించుకుంది. భారత ప్లేయర్లు పూనమ్ యాదవ్, స్నేహ్ రాణా, సుష్మా వర్మ, శుభా సతీశ్‌తోపాటు విదేశీ స్టార్లు హీథర్ నైట్, లిజెల్ లీ, లారెన్ బెల్, సారా గ్లెన్, కిమ్ గార్త్ అన్‌సోల్డ్‌గా మిగిలారు. భారత్‌కు చెందిన 16 ఏళ్ల జి కమలిని భారీ ధర పలికింది. ఈ తమిళనాడు వికెట్‌కీపర్ కనీస ధర రూ.10 లక్షలు కాగా.. ముంబయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆమె కోసం తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు కమలినిని ముంబయి రూ.1.60 కోట్లకు దక్కించుకుంది. ఈమె అండర్-19 మహిళల టీ20 ట్రోఫీలో ఎనిమిది మ్యాచ్‌ల్లో 311 పరుగులు సెకండ్ టాప్ స్కోరర్‌గా నిలిచింది. పార్ట్ టైమ్ స్పిన్నర్‌గానూ ప్రభావం చూపుతుంది.




## యూఏఈలో భారత్ మ్యాచ్‌లు?

### హైబ్రిడ్ పద్ధతిలోనే ఛాంపియన్స్ ట్రోఫీ!

వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యమివ్వాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ విధానంలోనే జరగడం దాదాపుగా ఖాయమైంది. దీని ప్రకారం భారత్ తన మ్యాచ్‌లను యూఏఈలో ఆడనుంది. ఈ టోర్నీ కోసం పాక్‌కు టీమ్‌ఇండియా వెళ్లేదే లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు హైబ్రిడ్‌కు ఒప్పుకోమని మొదట పాక్ మొండిపట్టు పట్టింది. భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీల్లోనూ తమ జట్టుకూ హైబ్రిడ్ విధానాన్ని కేటాయించాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో బీసీసీఐ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)తో చర్చించిన ఐసీసీ సామరస్యంగా సమస్యను పరిష్కరించినట్లు సమాచారం. 2027 వరకు భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ టోర్నీల్లో పాక్ మ్యాచ్‌లను ఇతర దేశంలో నిర్వహిస్తామని పీసీబీకి ఐసీసీ హామీ ఇచ్చినట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. కానీ లిఖితపూర్వక హామీ కావాలని పీసీబీ అడిగింది. ఇప్పుడీ సమస్యకు తెరదించిన ఐసీసీ.. ఒకట్రెండు రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది.

## టెస్టుల్లో ఆడాలని ఉంది : అర్ష్‌దీప్ సింగ్




టెస్టుల్లో ఆడాలని ఉందని టీమ్ ఇండియా ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తన కోరిన బయటపెట్టాడు. తాజాగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అర్ష్‌దీప్ మాట్లాడుతూ.. టెస్టులు సహా మూడు ఫార్మాట్లలో ఆడాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేశాడు. 'ఆటగాడిగా మనం రెడ్ బాల్‌తో కెరీర్‌ను మొదలుపెడతాం. మనం పట్టుకునే మొదటి బంతి రెడ్ బాలే. ఎర్రబంతితో బౌలింగ్ చేయడం సరదాగా ఉంటుంది. ఎందుకంటే అది ప్రారంభంలో స్వింగ్ అవుతుంది. పాతబడినా స్వింగ్ రాబట్టొచ్చు. మూడు ఫార్మాట్లలో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం.'అని అర్ష్‌దీప్ తెలిపాడు. ఈ సందర్భంగా స్టార్ పేసర్ బుమ్రాతో సంభాషణను పంచుకున్నాడు. 'ఓ సారి బుమ్రా మూడు ఫార్మాట్లలో ఆడాలనుకుంటున్నావా? అని నన్ను అడిగాడు. అవును, నేను మూడు ఫార్మాట్లలో ఆడటానికి ఆసక్తిగా ఉన్నా. భారత్ తరపున మరిన్ని మ్యాచ్‌లు గెలవాలని కోరుకుంటున్నానని అతనితో చెప్పా.' అని చెప్పుకొచ్చాడు. అదే ఇంటర్వ్యూలో పాల్గొన్న భారత మాజీ క్రికెటర్ సురేశ్ రైనా.. అర్ష్‌దీప్‌ను ప్రశంసించాడు. టెస్టుల్లో జహీర్ ఖాన్, ఆశిష్ నెహ్రా, ఆర్పీ సింగ్ వంటి దిగ్గజ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ల అడుగుజాడల్లో అర్ష్‌దీప్ నడిచే అవకాశం ఉందని చెప్పాడు. 'చాలా రోజుల తర్వాత నార్త్ ఇండియా నుంచి ఓ పొడువాటి ఫాస్ట్ బౌలర్‌ను చూశా. అతను స్వింగ్, రివర్స్ సింగ్ రాబట్టగలడు. అర్ష్‌దీప్ టెస్టు క్రికెట్ ఆడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. ఆస్ట్రేలియాకు అతన్ని పంపించాల్సింది. కొత్త, పాత బంతితో కీలక సమయాల్లో వికెట్లు తీసే అతన్ని భవిష్యత్తులో పెద్ద సిరీస్‌లకు ఎంపిక చేయాలి.' అని రైనా చెప్పుకొచ్చాడు.



### చీరకట్టులో కవ్విస్తున్న

## మాళవిక మోహనన్

మాళవిక మోహనన్ ప్రతిభావంతులైన నటి. ఆమె ప్రధానంగా మలయాళం మరియు తమిళ చిత్రాలలో పనిచేసింది. మాళవిక ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె యు మోహనన్ మరియు బీనా మోహనన్ కుమార్తె. ఆమె కేరళలోని కన్నూర్‌లోని పయ్యనూర్‌కు చెందినది. ఆమె 2013లో రొమాంటిక్ డ్రామా పట్టం పోల్‌తో తన నటనా రంగ ప్రవేశం చేసింది. ఇది ఆమె మలయాళ సినిమాల్లోకి ప్రవేశించింది. మాళవిక ఆ తర్వాత పెట్టా సినిమాతో తమిళ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి పూంగోడి మాలిక్ పాత్రను పోషించింది. తమిళ యాక్షన్ చిత్రం మాస్టర్‌తో ఆమె కెరీర్ కొత్త శిఖరాలకు చేరుకుంది. మాస్టర్ 2021లో విడుదలైంది. మాళవిక తన నటనా ప్రతిభతో పాటు తన క్లాసిక్ స్టైల్‌కు మెచ్చుకుంది. ఆమె ఇటీవలి ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో, ఆమె బంగారు అంచులతో తెల్లటి చీరలో అందంగా కనిపించింది. ఆమె చీరను నెక్లెస్ మరియు బ్యాంగిల్స్‌తో సహా సొగసైన నగలతో జత చేసింది. ఆమె నీట్‌గా కట్టుకున్న జుట్టు మరియు మినిమల్ మేకప్ ఆమె సాంప్రదాయ రూపానికి మనోజ్ఞతను జోడించాయి.



### కవ్వించే అందాలతో

## కాక పుట్టిస్తున్న శ్రీవల్లి

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న గురించి తెలుగు వారికి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. వరుస హిట్ సినిమాలతో దూసుకుపోతుంది. ఈ అమ్మడు 'గీత గోవిందం'సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. మహేష్ బాబు- అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'సరిలేరు నీకెవ్వరు' నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. అల్లు అర్జున్- సుకుమార్ కాంబోలో తెరకెక్కిన పుష్ప 1 నటించే అవకాశం కొట్టేసింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో తన దశ తిరిగింది. దీంతో నేషనల్ క్రష్ గా మారింది. ఈ తరుణంలోనే మరో బంపర్ హిట్ అందుకున్నది రష్మిక. హిందీలో యానిమల్ అనే ప్యాన్ ఇండియా చిత్రంలో నటించి మరో భారీ విజయాన్ని అందుకుంది. తనకంటూ ప్రత్యేక ప్యాన్ ఫాలోయింగ్ సోంత చేసుకుంది. ఇక మరోవైపు రష్మిక ఓ సంచలన రికార్డ్‌ను క్రియేట్ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో తరచు యాక్టివ్ గా ఈ అమ్మడు తన ఇన్స్టాగ్రామ్ అకౌంట్‌లో మొత్తంగా 44 మిలియన్ ఫాలోవర్స్ ను దక్కించుకుని ఒక గొప్ప రికార్డు నమోదు చేసింది.

### లేత గులాబీ దుస్తులలో

## రష్మీ అందాలు

ప్రేమలో పడండి, ఇటీవల, రష్మీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక చిత్రాన్ని పంచుకుంది, అక్కడ ఆమె అందంగా లేత గులాబీ దుస్తులలో అందంగా కనిపించింది.రష్మీ గౌతమ్ తెలుగు టీవీ పరిశ్రమలో సుప్రసిద్ధ వ్యక్తి. పాపులర్ కామెడీ షో జబర్దస్త్‌లో ఆమె తన ప్రత్యేకమైన హోస్టింగ్ స్టైల్‌కు పేరు తెచ్చుకుంది. ఈ ప్రదర్శన ఆమెకు పెద్ద సంఖ్యలో అభిమానులను నిర్మించడంలో సహాయపడింది. హోస్ట్‌గా ఆమె నైపుణ్యాలు ఆమెను తెలుగు మాట్లాడే ప్రాంతాలలో సుపరిచితమైన ముఖంగా మార్చాయి. టెలివిజన్‌లో విజయం సాధించడానికి ముందు, రష్మీ 2010లో విడుదలైన ప్రస్థానం అనే తెలుగు చిత్రంలో సహాయక పాత్రలో కనిపించింది. ఒక రియాలిటీ డ్యాన్స్ షో సమయంలో, నటి సంగీత ఆమె ప్రతిభను గమనించి దర్శకుడు ముగిల్‌కి సిఫార్సు చేసింది. ఇది 2011లో తమిళ చిత్రం కండెన్‌లో రష్మీ ప్రధాన పాత్ర పోషించింది. ఇటీవల, రష్మీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక చిత్రాన్ని పంచుకుంది, అక్కడ ఆమె అందంగా లేత గులాబీ దుస్తులలో అందంగా కనిపించింది. దుస్తులు చక్కని స్పర్శను జోడించిన వివరణాత్మక డిజైన్‌లను కలిగి ఉన్నాయి. ఆమె ఫోటోకు "ఇయర్ ఎండ్ వైబ్స్" అని క్యాప్షన్ ఇచ్చింది.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986